క్లుప్తంగా

1న హనుమజ్జయంతి

బోట్‌క్లబ్‌: హనుమత్‌ జయంతి సందర్భంగా వచ్చే నెల 1న స్థానిక మెయిన్‌ రోడ్డులోని సీతా రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పంచమాలతో అలంకరణ, తమలపాకుల పూజ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక హనుమాన్‌ పూజ, సాయంత్రం 6 గంటలకు సామూహిక హనుమాన్‌ చాలీషా పారాయణ ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

మహిళకు గ్రైండర్‌ అందజేత



వెంకటలక్ష్మికి గ్రైండర్‌ అందిస్తున్న ముత్తా నవీన్‌

బోట్‌క్లబ్‌: స్థానిక 29వ డివిజన్‌లో నిరుపేద మహిళ కమన వెంకటలక్ష్మికి బీజేపీ రాష్ట్ర మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌ ముత్తా నవీన్‌ బుధవారం గ్రైండర్‌ అందించారు. ఆమె ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన బీజేపీ సౌత్‌ మండల అధ్యక్షులు చెక్కా రమేష్‌ వెంకటలక్ష్మి ఈ విషయాన్ని నవీన్‌కు తెలిపారు. ఆమెకు సేవా సంపర్క్‌ అభిమాన్‌లో భాగంగా గ్రైండర్‌ సమకూర్చారు. ఈ సందర్భంగా ముత్తా నవీన్‌ మాట్లాడుతూ మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, చిన్ని, రామారావు, తాళ్లూరి రాజేష్‌, దొడ్డి వీరేంద్ర, బందర్‌ మిఠాయి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

దానగుణంతో అమితానందం

కాకినాడ రూరల్‌: దానగుణంతో అమితానందం కలుగుతుందని, తోటి మనిషికి సాయం చేయడం వల్ల కలిగే ఆనందం ఎనలేనిదని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్‌ వెంకట్రావు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్‌ కార్యాలయంలో దాత బసవరావు ఆర్థిక సహకారంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు బుధవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ పేదలు, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. డాక్టర్‌ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్‌, శ్రీవాణి, డాక్టర్‌ శిరీష, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి

సామర్లకోట: సామర్లకోట- పెద్దాపురం రోడ్డులోని డివైడర్‌లో ఉన్న మొక్కల సంరక్షణపై పెద్దాపురం మున్సిపల్‌ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికార పార్టీ కౌన్సిలర్‌ విజ్జపు రాజశేఖర్‌ అన్నారు. బుధవారం పెద్దాపురంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్‌ సాధారణ సమావేశం జరిగింది. ఈ రోడ్డు వెంబడి డివైడర్‌లో ఉన్న మొక్కలు ఎండలకు చనిపోతున్నాయని, వాటికి నీరు పోసే ఏర్పాట్లు చేయడంతో పాటు కొత్త మొక్కలు వేయాలని సూచించారు. అదే విధంగా మున్సిపాలిటీ కొనుగోలు చేసిన జేసీబీని సక్రమంగా ఉపయోగించే విధంగా చూడాలన్నారు. ఎన్నికల కోడ్‌ పూర్తయిన తరువాత మొక్కల విషయం పరిశీలిస్తామని కమిషనర్‌ పద్మావతి అన్నారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్న కారణంగా చర్చలు జరపడానికి అవకాశం లేదన్నారు. వైస్‌ చైర్‌పర్సన్‌ కనకాల మహాలక్ష్మి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ దావిద్‌రాజు, మేనేజర్‌ జ్యోతిరాణి, టీపీఓ ఫణి కుమార్‌, అధికార, ప్రతిపక్ష సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం

కొత్తపల్లి: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. కొత్తపల్లి మండలం రమణక్కపేట, సామర్లకోట మండలం పవరలో ఉన్న భూములను ఏడాది పాటు సాగు చేసుకోవడానికి ఆలయ ఈఓ, సహాయ కమిషనర్‌ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించారు. రమణక్కపేటలో 9.82 సెంట్ల భూమికి గతంలో రూ.2.25 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.4.01 లక్షలు సమకూరింది. పవరలో 2.38 సెంట్ల సాగు భూమికి గతంలో రూ.58 వేలు రాగా ఈ ఏడాది రూ. 1.01 లక్షలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

మహిళ మెడలో బంగారం చోరీ

గొల్లప్రోలు: మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు తాడును అపహరించినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. బుధవారం రౌతులపూడి గ్రామానికి చెందిన పసగొడుగుల రాంబాబు, అతని భార్య కనక మహాలక్ష్మి మోటారు సైకిల్‌పై ప్రత్తిపాడు వైపు వెళ్తుండగా దొడ్లడైరీ సమీపంలో ఈ ఘటన జరిగింది. వారి వెనక నుంచి మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి రాజమండ్రి ఎంత దూరం అని అడిగారు. వారికి ఆ దంపతులు నెమ్మదిగా ఆగి సమాధానం ఇస్తుండగా ఆమె మెడలోని సుమారు 10 గ్రాముల బంగారు తాడును తెంచుకుని పోయినట్లు ఎస్సై బాలాజీ తెలిపారు. ఈ ఘటనలో కనకమహాలక్ష్మి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ మార్పు.. మన మంచికే..

- నిరంతర వాహన తనిఖీలతోనే మేలు
- ప్రమాదభరిత రైడింగ్‌కు అడ్డుకట్ట



సర్పవరం జంక్షన్‌ వద్ద పోలీసులు పట్టుకున్న రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు



నగరంలో యువతకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాసరావు

కాకినాడ రూరల్‌: అతివేగం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది.. డ్రైవర్‌ నిర్లక్ష్యానికి ఓ కుటుంబంలో విషాదం నిండింది.. ఇవీ మనం తరచూ వినే వార్తలు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో చాలా మంది బలవుతూనే ఉన్నారు. మరికొందరు గాయాల పాలై దివ్యాంగులుగా మారుతున్నారు. ఇందుకు కారణం నిర్లక్ష్యపు డ్రైవింగ్‌, అతివేగం. జిల్లాలో పోలీసులు సోమవారం సాయంత్రం రెండు గంటల పాటు నిర్వహించిన నాకాబందీ కార్యక్రమంలో రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎక్కువ మంది యువత లైసెన్స్‌లు లేకుండానే ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్టు వెల్లడైంది. మగవారికి ఆడవారు ఏమీ తీసుపోరన్నట్టు మహిళలు ముఖ్యంగా యువతులు లైసెన్స్‌లు లేకుండా స్కూటీలు నడుపుతున్నట్టు గుర్తించారు. ప్రమాదం జరగనంతసేపు బాగానే ఉంటుంది. మనం నడిపే వాహనంతో ఎవరినైనా ఢీకొడితే వారికి ఏమైనా అయితేనే చిక్కు. చట్ట ప్రకారం నేరం. ఇక యువకులు, విద్యార్థులు స్పీడ్‌ బైక్‌లతో ప్రమాదాలకు కారకులవుతున్నారు. వంద కిలోమీటర్ల స్పీడ్‌ దాటితేనే బైక్‌ నడిపినట్టుగా ఫీలవుతూ రోడ్డుపై ప్రయాణాలు చేసి ఇతర వాహనదారులకు దడ పుట్టిస్తున్నారు. చూస్తుండగానే తమను దాటుకుని అతి వేగంగా వెళుతున్న బైక్‌లు ఒకవేళ తమను ఢీకొడితే పరిస్థితి ఏంటనే భయాందోళన ప్రజల్లో ఉంది. ఎన్నికలు కౌంటింగ్‌ దగ్గర పడుతుండటంతో పోలీసులు అల్లరిమూకల నిర్మూలన, రికార్డులు లేని వాహనాల గుర్తింపు కోసం తనిఖీలు చేశారు. కానీ ఈ తనిఖీలు నిరంతర ప్రక్రియగా మారితే చాలామంది అశ్రద్ధ లేకుండా డ్రైవింగ్‌ లైసెన్స్‌లు తీసుకోగలుగుతారు. తాము నడుపుతున్న వాహనాలకు సీ బుక్‌, ఇన్సూరెన్స్‌, పొల్యూషన్‌ సర్టిఫికెట్‌ తదితర రికార్డులు ఉన్నాయో లేవో గమనిస్తారు. రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకుంటారు. తద్వారా పోలీసులు వాహనాలు తనిఖీ చేసినా ఇబ్బంది లేకుండా నిర్భయంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా డ్రైవింగ్‌ లైసెన్స్‌లపై రవాణా శాఖ అధికారులు అవగాహనతో పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించగలిగితే బాగుంటుంది.

నమ్మండి.. ఇది నిజమండి

సోమవారం నిర్వహించిన నాకాబందీలో భాగంగా కాకినాడ జేఎన్‌టీయూ వద్ద వాహనాలు తనిఖీ చేస్తే ముఖ్యంగా యువతులు వంద మందిలో ముగ్గురికి మాత్రమే లైసెన్స్‌లు ఉన్నాయని, మిగిలిన వారికి లైసెన్స్‌లు లేవని తనిఖీలు నిర్వహించిన తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో సీఐ మురళీకృష్ణ, తన సిబ్బంది వాహనాలు తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఆ వాహనాలు నడిపిన యువతకు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. వాహనదారుల్లో మార్పు వచ్చేలా నిరంతం తనిఖీలు ఉండాలని పలువురు కోరుకుంటున్నారు. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచిస్తున్నారు.

నేడు స్వరార్చన

బోట్‌క్లబ్‌: ఆర్కెస్ట్రా పితామహుడు దివంగత పెద్దిరెడ్డి గంగాధరం మాస్టర్‌ జయంతి సందర్భంగా గురువారం స్వరార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు పెద్దిరెడ్డి సతీష్‌ బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్యకళా మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశ విదేశాల్లో వేలాదిగా సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించిన ఘనత గంగాధర్‌ మాస్టర్‌దే అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1955లో ఆర్కెస్ట్రాను స్థాపించారన్నారు. అప్పటి తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామ సమీపంలోని హసన్‌బాద్‌లో 1937లో గంగాధరం జన్మించారన్నారు. సంగీతంపై ఉన్న మక్కువతో చించినాడ సన్యాసిరావు వద్ద కర్ణాటక సంగీతం, ఆకుల నరసింహారావు వద్ద హిందుస్థానీ సంగీతం, హార్మోని నేర్చుకున్నట్లు చెప్పారు. సూర్యకళా మందిరంలో సంగీత విభావరికి చెన్నై నుంచి ప్రముఖ ప్లే బ్యాక్‌ సింగర్‌ రాము, హైదరాబాద్‌ నుంచి ప్లే బ్యాక్‌ సింగర్‌, వివిధ పాటల పోటీల్లో పాల్గొని ప్రముఖుల మన్ననలు పొందిన కుమారి శ్రీలలిత, గంగాధరం మాస్టర్‌ శిష్యులు పాల్గొంటారన్నారు. సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సక్రమంగా నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ నివాస్‌



ఓట్ల లెక్కింపుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ నివాస్‌

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్‌ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పారిశుధ్యం, తాగునీరు, మొబైల్‌ టాయిలెట్స్‌, కౌంటింగ్‌ సిబ్బందికి భోజనం, ఇతర సదుపాయాలు, మీడియా సెంటర్‌లో వసతులు తదితర అంశాలపై కలెక్టర్‌ నివాస్‌ రెవెన్యూ, మున్సిపల్‌ కార్పొరేషన్‌, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్‌, డ్వామా, డీఆర్‌డీఏ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఏజెంట్లకు అవసరమైన సదుపాయాలపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జేఎన్‌టీయూలో పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులకు సూచించారు. కౌంటింగ్‌ సిబ్బంది, అధికారులకు అవసరమైన తాగునీరు, భోజనం, ఇతర సదుపాయాలను జిల్లా పంచాయతీ అధికారి చూడాలని కలెక్టర్‌ తెలిపారు. అదే విధంగా జేఎన్‌టీయూలో తాగునీరు, మొబైల్‌ టాయిలెట్స్‌ ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులను ఆదేశించారు. మీడియా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో వసతులు, భోజనం, ఇతర సదుపాయాలను జిల్లా పౌరసరఫరా సంస్థ డీఎం చూడాలన్నారు. ప్రధానంగా తుని, పిఠాపురం వైపు నుంచి వచ్చే వాహనాలను అచ్చంపేట దగ్గర, యానాం, కాకినాడ రూరల్‌, కాకినాడ పట్టణం నుంచి వచ్చే వాహనాలను భానుగుడి దగ్గర ట్రాఫిక్‌ మళ్లించడం జరిగిందన్నారు. కౌంటింగ్‌ ఏజెంట్లు, అభ్యర్థులు ట్రాఫిక్‌ ఇబ్బందులు పడకుండా వ్యవసాయశాఖ జేడీ పర్యవేక్షించాలన్నారు. జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం నుంచి ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఏజెంట్లు, అభ్యర్థులను తరలించేందుకు సిద్ధం చేసిన వాహనాల ఏర్పాట్లను డీఆర్‌డీఏ పీడీ పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్‌, కాకినాడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఏడీసీ సీహెచ్‌ నాగనరసింహారావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.బాలసరస్వతి, వ్యవసాయ శాఖ జేడీ ఎస్‌.విజయకుమార్‌, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా సమాచారశాఖ డీడీ డి.నాగార్జున, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ ఎం.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్ల పరిశీలన



స్ట్రాంగ్‌ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.రామ్‌సుందర్‌రెడ్డి బుధవారం కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సెంట్రల్‌ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్‌ రూమ్‌లను సందర్శించారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్‌ రూమ్‌కు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. జూన్‌ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

పంచారామ క్షేత్రంలో శివలింగం జీర్ణోద్ధరణ



పురావస్తు శాఖ అధికారులతో చర్చిస్తున్న ఈఓ బళ్ల నీలకంఠం

- పనులు ప్రారంభించిన పురావస్తు శాఖ
- ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. క్షేత్రంలో స్వామివారి శివలింగం జీర్ణస్థితికి చేరుతున్నట్లు గుర్తించి దేవదాయ శాఖాధికారుల సూచనల మేరకు కేంద్ర పురావస్తు శాఖ సర్వే ఆఫ్‌ ఇండియా ద్వారా శివలింగానికి జీర్ణోద్ధరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ శివలింగం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా స్వామివారి, అమ్మవార్ల దర్శనాలు నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు మండపారాధనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కలశస్థాపన, కళారాధన, దేవతారాధన, అగ్నిహోత్ర సంబంధమైన హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణకుంభంలో కళలను ఆవాహన చేశారు. ఈ మేరకు ఉత్సవ, దేవతామూర్తులను ఆవాహన చేసిన పూర్ణకుంభాన్ని నంది మండపంలో ఏర్పాటు చేసి ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు చేశారు. నంది మండపంపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులను ఉదయం 10.40 గంటలకు భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించారు.

దర్శనాలు నిలిపివేసి..

అతిపురాతన పంచారామ క్షేత్రంలోని స్వామివారిని భావితరాల వారు దర్శించుకునే విధంగా 15 ఏళ్ల కిందట కెమికల్‌ ట్రీట్‌మెంట్‌ చేశారు. కాగా బుధవారం నుంచి మళ్లీ శివలింగానికి కెమికల్‌ ట్రీట్‌మెంట్‌ చేయడానికి శివలింగాన్ని పురావస్తు శాఖాధికారులకు ఈఓ బళ్ల నీలకంఠం స్వాధీనం చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకోవడం మంచిది కాదని, గర్భాలయాలను మూసి వేసి భక్తుల దర్శనాలు నిలిపివేశారు. భక్తులు ధ్వజస్తంభం మీదుగా ఆలయంలోకి ప్రవేశించి పెద్ద నంది వద్ద ఉన్న మండపంపై ఉత్సవ మూర్తులను దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జీర్ణోద్ధరణ పనులకు సంబంధించి ఏర్పాట్లను పురావస్తు శాఖ సీఏ కేవీఎస్‌ మూర్తి, ఉపస్తపతి జి.శ్రీనివాసాచార్యులు, ఈఓ బళ్ల నీలకంఠం పరిశీలించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదానం కొనసాగింది. భక్తులకు దేవస్థాన సిబ్బంది, భక్త సంఘ నాయకుడు తలుపుల అంజనీకుమార్‌, బీవీ రమణ సేవలందించారు.

అనుమతులు లేకుండా ఊరేగింపులు వద్దు



యండమూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ



తహసీల్దార్‌ కార్యాలయంలో మాట్లాడుతున్న రిటర్నింగ్‌ అధికారి ఇట్ల కిశోర్‌

కరప: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ వచ్చే నెల 4న జరుగుతుందని, గెలుపు, ఓటములు ఎవరిపక్షాన ఉన్నా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని తహసీల్దార్‌ వి.రామకోటేశ్వరరావు సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం మండలంలోని ఉప్పలంక, గొర్రిపూడి, యండమూరు, వేళంగి, అరట్లకట్ట గ్రామాల్లో ఆయన కరప ఎస్సై టి.రామకృష్ణతో కలసి పర్యటించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో తహసీల్దార్‌ మాట్లాడారు. పార్టీల నాయకులు పరస్పరం విమర్శించుకోకుండా, కలసికట్టుగా సాగాలన్నారు. అనుమతులు లేకుండా ఎటువంటి ఊరేగింపులు, బాణసంచా కాల్పులు చేయరాదన్నారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఏఎస్సై వి.సూరిబాబు, ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు, ఆయా గ్రామాల కార్యదర్శులు పి.వీరభద్రరావు, పి.శ్రీనివాసరావు, వి.సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

కాకినాడ రూరల్‌: ఎన్నికల పోటీలో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో రూరల్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి ఇట్ల కిశోర్‌ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్లకు గుర్తింపు పత్రాలు మంజూరు చేస్తారన్నారు. కౌంటింగ్‌ రోజు ఏజెంట్లు ఉదయం ఐదు గంటలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఏ విధమైన ఎలక్ట్రానిక్‌ వస్తువులు అనుమతించేది లేదన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సహాయ రిటర్నింగ్‌ అధికారి బి.విజయప్రసాద్‌, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొదలెట్టారు.. మళ్లీ వదిలేశారు

- నిలిచిన అరట్లకట్ట రోడ్డు విస్తరణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జెడ్‌.భావారం సమీపంలో గుంతలమయంగా రోడ్డు



కొరిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా వదిలేసిన సీసీ డ్రైయిన్‌

కరప: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుంది అభివృద్ధి పనుల తీరు.. నిధులున్నా కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో పనులు ముందుకు కదలక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు మండలాలను అనుసంధానం చేసే రహదారి విస్తరణ పనులు కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయి. ఆ వివరాలను పరిశీలిస్తే.. కరప, పెదపూడి మండలాలను అరట్లకట్ట రోడ్డు అనుసంధానం చేస్తుంది. కరప నుంచి అరట్లకట్ట, కొరిపల్లి, జెడ్‌.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల మీదుగా పెదపూడి మండలం కరకుదురును కలుపుతుంది. ఈ గ్రామాల ప్రజలు కాకినాడ పట్టణానికి కరకుదురు, ఇంద్రపాలెం మీదుగా వెళ్లేందుకు దగ్గర దారి. అలాగే పెదపూడి, జి.మామిడాడ గ్రామాలకు వెళుతుంటారు. అటు నుంచి పెదపూడి మండల వాసులు కరప మండలానికి అరట్లకట్ట వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ అరట్లకట్ట రోడ్డు సింగిల్‌వేగా ఉండేది. రోడ్డు గుంతలు పడి ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడేవారు. ఈ రహదారిలో ఉండే అరట్లకట్ట వంతెన కూడా శిథిలావస్థకు చేరడంతో పాటు ఒకవైపు కుంగిపోయింది. ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు 2021లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి రహదారి ఆధునీకరణకు నిధులు మంజూరు చేశారు. రూ.18.50 కోట్లతో కరప నుంచి దోమాడ మీదుగా ఇంద్రపాలెం, కరప, పెదపూడి, కాకినాడ రూరల్‌ మండలాలను అనుసంధానిస్తూ రహదారి అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కన్నబాబు రూ.18.50 కోట్లు మంజూరు చేశారు. 2022 ఏప్రిల్‌ 25న కాకినాడ ఎంపీ వంగా గీతతో కలసి రోడ్డు పనులకు భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి మధ్యలో కల్వర్టులు, అరట్లకట్ట వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. సింగిల్‌ రోడ్డుగా ఉండే అరట్లకట్ట రోడ్డు వెడల్పుచేసి, బీటీ రోడ్డు వేయాలి. కాంట్రాక్టర్‌ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి గోతులు తవ్వి వదిలేశారు. తర్వాత ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో పనులు చేపట్టారు. అరట్లకట్ట వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి, డ్రెయిన్లు, రోడ్డు ఆధునీకరణ పనులను కాంట్రాక్టర్‌ అర్థాంతరంగా వదిలేశారు. కరప, కొరిపల్లి, గొడ్డటిపాలెం, జెడ్‌.భావారం గ్రామాల్లో సీసీ డ్రెయిన్లు చేపట్టి పూర్తి చేయలేదు. రోడ్డు వెడల్పు చేసేందుకు గోతులు తవ్వి వదిలేయడం, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి కంకర, ఇసుక రోడ్డుపై వేసి అలా ఉంచేయడం చేశారు. దీంతో గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు ఆధునీకరణ పనులు పూర్తి చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారంటే..

అసంపూర్తిగా వదిలేసిన అరట్లకట్ట రోడ్డు విస్తరణ, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులపై రోడ్లు, భవనాల శాఖ డీఈఈ బీవీఎస్‌ వర్మను వివరణ కోరగా పనుల్లో జాప్యం జరగడం వాస్తవమేనన్నారు. ఎన్నికల కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. జూన్‌ 4వ తేదీ తర్వాత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయిస్తామని వర్మ తెలిపారు.

అసంపూర్తి పనులతో ప్రమాదాలు



రోడ్డు వెడల్పు చేసేందుకు గోతులు తవ్వేశారు. డ్రెయిన్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. అసంపూర్తి పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు పక్కకు వెళితే అదుపు తప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులు స్పందించి విస్తరణ పనులు పూర్తి చేయించాలి.

–పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరప

అధికారులు చర్యలు తీసుకోవాలి



రోడ్డు ఆధునీకరణ పనులు నిలిపివేయడం వల్ల రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంటోంది. డ్రెయిన్లు సగం సగం వేయడం వల్ల వీధుల్లోకి వచ్చిన చిన్నపిల్లలు డ్రెయిన్‌లో పడి, గాయాల పాలవుతున్నారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదులకు సమాధానం చెప్పలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–యాళ్ల సుబ్బారావు, జెడ్పీటీసీ, కరప మండలం

ఫిల్టర్‌ బెడ్‌ పరిశీలన



సామర్లకోటలో ఫిల్టర్‌ బెడ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ రామారావు

సామర్లకోట: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామారావు తెలిపారు. బుధవారం ఫిల్టర్‌ బెడ్‌ ప్లాంట్‌లో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్లాంట్‌లో పూర్తిగా శుద్ధి అయిన తరువాత ప్రజలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న నీటిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కుళాయిల ద్వారా తాగునీరు ఆకుపచ్చ రంగులో వస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తుందనే ప్రచారం మేరకు నీటిని నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపామన్నారు. ఫిల్టరు చెరువు, ఫిల్టర్‌ బెడ్‌, పబ్లిక్‌ కుళాయిలో వచ్చిన నీటిని ల్యాబ్‌కి పంపగా నీటిలో ఎటువంటి లోపాలు లేవని రిపోర్టు వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ నుంచి సరఫరా చేస్తున్న నీటిపై అపోహలు వీడి, నీటిని వేడి చేసుకుని చల్లార్చి తాగాలని కమిషనర్‌ సూచించారు. కార్యక్రమంలో వాటర్‌ వర్క్స్‌ సిబ్బంది పాల్గొన్నారు.